క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహానికి వేమిరెడ్డి నివాళి



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న స్థానిక నాయకులు

కావలి: మండలంలోని సర్వాయపాళెం–ఆనెమడుగు కూడలిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా భరత్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఆనెమడుగులో భరత్‌రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంభులింగేశ్వరస్వామి సేవలో బీద



ప్రత్యేక పూజల అనంతరం బీద మస్తాన్ రావును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి శంభునిపాళెంలో పార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి దేవస్థానంలో నూతనంగా శంభులిగేశ్వర స్వామి, పార్వతీదేవిలను ప్రతిష్టించారు. ఆదివారం శివపార్వతుల కల్యాణం, ప్రత్యేక హోమాలు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన సొంత గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మినుము విత్తనాలు పంపిణీకి సిద్ధం

వరికుంటపాడు: మండలంలోని రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులకు రాయితీపై మినుము విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఓ వి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మండలంలో రైతులు సుమారు 1,300 ఎకరాల్లో మినుము సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారన్నారు. మినుము సాగులో ప్రధాన పల్లాకు తెగులు సమస్యను తట్టుకునే విధంగా పీయూ–31, టీబీజీ–104, రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. అసలు ధర రూ.470, నాలుగు కేజీల సంచి ధర 30 శాతం రాయితీపై రూ.329లకే రైతులకు అందిస్తామన్నారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మవార్లకు పాలపొంగళ్ల



చిలకపాడు అమ్మవారి ఆలయంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఆత్మకూరు (మర్రిపాడు): శ్రావణమాసం మూడో ఆదివారం పురస్కరించుకుని మర్రిపాడు మండలం చిలకపాడు పొలిమేర్లలోని పోలేరమ్మతల్లి, అంకాలమ్మతల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాలపొంగళ్లు నైవేద్యాలు సమర్పించారు. ఏటా శ్రావణ మాసం మూడో ఆదివారం నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ అని గ్రామస్తులు చెబుతున్నారు. వేకువజామునే మహిళలు శివార్లలోని అమ్మవార్ల దేవాలయాల వద్దకు చేరుకుని దేవాలయ ఆవరణలో పొంగళ్లు వండి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో పాడి పంటలు, పశుసంపద వృద్ధి చెంది సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని గ్రామ దేవతలను మొక్కుకున్నారు.

సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాత్రి డీసీహెచ్‌ఎస్ (జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రాల కోఆర్డినేటర్) డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న డాక్టర్ కౌశికను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం మీద ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

గిరికే అందం.. ట్యాంక్‌బండ్

చారిత్రక నేపథ్యం ఉన్న ఉదయగిరికి దుర్గం తలమానికం అయితే.. ట్యాంక్ బండ్ గిరికే అందాలు తేనుంది. శ్రీకృష్ణ దేవరాయల పాలనలో ఉదయగిరి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి పట్టణంలోకి ప్రవేశించే ముఖద్వారం వద్ద చెరువు నిర్మించారు. ఇప్పుడు ఆ చెరువు కట్టను ట్యాంక్ బండ్‌గా ఆధునికీకరించడంతో కొత్త అందాలు సంతరించుకోనున్నాయి.

రూ.9.5 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే రూ.2.5 కోట్లు ఖర్చు చేసిన వైనం
- నవంబరు చివరికల్లా పూర్తి చేసేలా ప్రణాళికలు
- పూర్తయితే మారనున్న ఉదయగిరి రూపురేఖలు



శరవేగంగా జరుగుతున్న ఉదయగిరి ట్యాంక్‌బండ్ పనులు

ఉదయగిరి: ఉదయగిరి ముఖద్వారం వద్ద వున్న చెరువును (ట్యాంక్‌బండ్) జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామకొలను పథకం కింద ఆధునికీకరించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఉదయగిరి ముఖద్వారం రూపురేఖలు మారనున్నాయి. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.9.5 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.2.5 కోట్లు నిధులు ఖర్చు చేసి ట్రాక్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ఈ చెరువుకు వర్షాకాలంలో ఉదయగిరి కొండపై ఉన్న వనమూలికలు తాకుతూ జాలువారిన నీటిధారలు చేరేవి. పట్టణ ప్రజలు ఈ నీటినే అలాగే వాడుకునేవారు. ఉదయగిరి నియోజకవర్గానికి ప్రముఖులు ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పటికీ ఈ చెరువు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. పట్టణం విస్తరించిన నేపథ్యంలో మురికినీరు చెరువులో చేరడంతో దుర్వాసన వెదజల్లే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో 2006లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పల్లెబాటలో ఉదయగిరి పర్యటన వచ్చిన సందర్భంగా ఈ చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లో ట్యాంక్‌బండ్ పనులను అందుబాటులో ఉన్న నిధులతో కొంత మేర పూర్తి చేశారు. అప్పటి వరకు పట్టణంలోనికి ప్రవేశించే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఈ నిధులతో విస్తరించడంతో చెరువుకు ఓ రూపు వచ్చింది. ట్యాంక్ బండ్‌పై లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో ట్యాంక్‌బండ్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.



దాదాపు పూర్తికావచ్చిన బండ్ నిర్మాణం

చేసే పనులు:
- చెరువు చుట్టూ 1300 మీటర్లు బండ్ ఏర్పాటు చేస్తారు. ఇది పటిష్టంగా ఉండేందుకు రెండు వైపులా రాళ్లతో రివిట్‌మెంట్ చేస్తున్నారు. ఈ ట్రాక్‌పై పట్టణ ప్రజలు వాకింగ్ చేసే విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు.
- ఈ బండ్‌పై సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తారు.
- బండ్‌పై పచ్చదనం పెంపొందే నిమిత్తం వివిధ రకాల మొక్కలతో చక్కగా ప్లాంటేషన్ చేస్తారు.
- పర్యాటకులు, పట్టణంలోని చిన్నపిల్లల సౌకర్యార్థం చిల్డ్రన్స్‌పార్కు ఏర్పాటు చేస్తారు. ఆ పార్కులో చిన్నపిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేస్తారు.
- బండ్‌పై సాయంత్రం వేళ పట్టణ ప్రజలు సేద దీరే నిమిత్తం బెంచీలు ఏర్పాటు చేస్తారు.
- ట్యాంక్‌బండ్ నడి మధ్యలోని నీటిలో పెద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తారు. (హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసి బుద్ధుడి విగ్రహం మాదిరిగా)
- వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఉన్న ప్రాంతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహంతో పాటు పలువురు జాతీయ నాయకుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తారు.
- ట్యాంక్‌బండ్ పర్యాటకులను ఆకర్షించే విధంగా వివిధ అత్యాధునిక సదుపాయాలతో వివిధ వసతులు కల్పిస్తారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, టైల్స్ ఏర్పాటు చేస్తారు.
- ఈ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు పూర్తయితే చారిత్రాత్మక నేపథ్యం గల ఉదయగిరికి పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. ముఖ్యంగా సెలవు దినాల్లో ఉదయగిరి దుర్గం సందర్శన, ప్రాచీన దేవాలయాలు, పలు కట్టడాలు చూసేందుకు ఆట విడుపుగా పర్యాటకులు వచ్చే అవకాశముంది.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో...

2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ట్యాంక్ బండ్ అభివృద్ధి విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే సీఎం స్పందించి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో 2022లో రూ.9.5 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ముందుగా 1300 మీటర్ల ట్యాంక్ బండ్ పనులు ప్రారంభించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే పనులు చేస్తున్నారు. ఇప్పటికే రూ.2.5 కోట్లు పనులు పూర్తయినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

శరవేగంగా ట్యాంక్‌బండ్ ఆధునికీకరణ



ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో ఉదయగిరి ట్యాంక్‌బండ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. పట్టణంలోని మురుగునీరు ట్యాంక్‌బండ్‌కు చేరకుండా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి ఆ నీరు ట్యాంక్‌బండ్ బయటకు పంపేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తాను. ఈ పనులు పూర్తయితే ఉదయగిరి ముఖ స్వరూపం పూర్తిగా మారుతుంది. ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తాను.
– మేకపాటి రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

నవంబరు నాటికి పనులు పూర్తిచేసేలా ప్రణాళికలు



గ్రామకొలను పథకంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ నిధులతో ఉదయగిరి ట్యాంక్‌బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది నవంబరు చివరి కల్లా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. రాత్రింబవళ్లు ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఈ ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులు పూర్తయితే ఉదయగిరి పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది.
– వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ, ఆత్మకూరు

పోర్టు, హార్బర్‌తో కావలికి మహర్దశ

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఒక వైపు రామాయపట్నం పోర్టు, మరో వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తో కావలికి మహర్దశ వచ్చిందని, ఇవి తన హయాంలో జరగడం తనకు గర్వంగా ఉందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలి నియోజకవర్గానికి ఎందరో ఎమ్మెల్యేలుగా పని చేశారు.. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్‌తో నిజమైన అభివృద్ధికి ఇప్పుడే అడుగులు పడ్డాయన్నారు. కావలి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 175వ రోజును పురస్కరించుకుని ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెద్ద పనులు మొదలైతే మిగిలిన పనులన్నీ కూడా ఆటోమేటిక్‌గా మొదలవుతాయనే దూరదృష్టితోనే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్‌లు నిర్మాణ పనులు జరిగేందుకు కృషి చేసినట్లు చెప్పారు. గత 30 ఏళ్లుగా ఎడతెగని జటిల సమస్యగా ఉన్న ఈ రెండింటి విషయంలో కసితో కూడిన పట్టుదలతో కృషి చేయడం వల్ల, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇక రానున్న రోజుల్లో పరిశ్రమలు ఏర్పాటు, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కావలి నియోజకవర్గ ప్రజలు అవసరమైన అన్నీ రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసేందకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వాటిల్లో రూ.54 కోట్లతో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయలు కల్పించినట్లు తెలిపారు.

జెండా ఆవిష్కరణ

స్థానిక మానస సెంటర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కసమర్లపూడి వెంకట నారాయణ, పుల్లా శ్రీనివాసులురెడ్డి దంపతులు, గుర్రం వెంకటేశ్వర్లు, నాగేశ్వరమ్మ, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ షాహుల్ హమీద్, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, ఈతముక్కల బాల మురళీరెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్న పుల్లయ్య, కనపర్తి రాజశేఖర్, నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, పెనుమల్లి అశోక్, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, షేక్ అబ్దుల్ రహీం, షేక్ నాయబ్ రసూల్, తిరువీధి ప్రసాద్, అమరా వేదగిరి, వింత ప్రభాకర్‌రెడ్డి, సురే మదన్ మోహన్‌రెడ్డి, పుత్తూరు నాగాచారి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, షేక్ ఖమర్‌బాబు, చేవూరు కిరణ్‌కుమార్, ఆత్మకూరు రాజేష్, స్కైలాబ్, చేవూరు పద్మ, శారద ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో వేమిరెడ్డి

కావలి: పట్టణంలోని 34వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో కలిసి వార్డులోని పలు నివాసాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 34వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పుల్లా శ్రీనివాసులు రెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారికి వార్డులో ఘనంగా నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం చెప్పారు. వైఎస్సార్‌సీపీ రంగుల బెలూన్‌లతో ఆకర్షణీయంగా అలకరించారు. పార్టీ రంగులతో ఉన్న ఎయిర్ పేపర్ పీస్‌లు నాయకులను అలరించాయి. క్రేన్ సహాయంతో భారీ గజమాలను ఎంపీ, ఎమ్మెల్యేకు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక గ్రామ దేవత కళుగోళమ్మ శాంభవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పింఛన్ కల సాకారం



షేక్ మునిర్‌జాన్‌కు దివ్యాంగుల పింఛన్‌ను అందిస్తున్న వలంటీర్ షేక్ నాజీయా

అల్లూరు: పదేళ్లుగా పింఛన్ కోసం చేసిన పోరాటం నేడు ఫలించడంతో ఆమె కళ్లు ఆనందంతో తడిసిపోయాయి. స్థానిక బీసీ కాలనికి చెందిన షేక్ మునిర్ జాన్ (40) పదేళ్ల క్రితం బ్రెయిన్ వ్యాధి కారణంగా మానసిక దివ్యాంగురాలైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆమె కుటుంబ సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆమెకు పింఛన్ మంజూరుకు ప్రయత్నించగా రేషన్ కార్డులో టెక్నికల్ సమస్య రావడంతో తన వలంటీర్ షేక్ నాజీయా రేషన్ కార్డులో తలెత్తిన సమస్యను పలు దఫాలుగా పరిష్కరించేందుకు కృషి చేశారు. ఆ సమస్య పరిష్కారం కావడంతో తాజాగా పింఛన్లు మంజూరు కావడంతో రూ.3 వేల ఆదివారం తన ఇంటికే వచ్చి అందించడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలో సచివాలయం–1 కన్వీనర్ షేక్ జంషీర్, నాయకులు షేక్ రసూల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు అమ్మఒడి



ఉత్తమ సేవలు అందించిన ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- అపస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

ఆత్మకూరు: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య విద్యాభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, అప్పుడే విద్యా ప్రమాణాల స్థాయి పెరుగుతుందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికే కాకుండా ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, అందులో భాగమే అమ్మఒడి పథకం అందరికి వర్తింపజేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. నాడు–నేడు పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పాఠశాలలు ఆధునికీకరింపబడి విద్యకు మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడమే కాకుండా ఎందరో ఉపాధ్యాయులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి ఎమ్మెల్సీగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఇప్పటికే పలువురికి తన వంతు సహకారం అందించానన్నారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించిన పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులను అపస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీని అపస్మా నిర్వాహకులు సన్మానించారు. డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓ ఎస్కే నజీర్ బాషా, అపస్మా కార్యవర్గ సభ్యులు సీవీ రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, టీసీవీ సుబ్బయ్య, డి ప్రభాకర్, ఈ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కలిగిరి: కావలిలో ఈ నెల 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో నిరుపేదలకు, ఎస్సీ, ఎస్టీలకు ఉచితం న్యాయం సహాయం, సలహాలు అందుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ఖర్చు, కాలయాపన లేకుండా అంతిమ తీర్పులు లోక్ అదాలత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కలిగిరి, కొండాపురం, జలదంకి, కావలి, బోగోలు మండలాల కక్షిదారులు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకుని ప్రశాంతంగా జీవించాలని ఆయన సూచించారు.

వలంటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: ఉదయగిరి మండలం కొండాయపాళెం సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.మల్లికార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టును ఎస్సీ జనరల్ సామాజిక వర్గానికి రిజర్వు చేయబడిందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆదివారం నుంచి మంగళవారంలోపు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలన్నారు. వీరికి 7వ తేదీ ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవూరులో 2, దేవరాయపల్లి బిట్–1లో ఒకటి, దేవరాయపల్లి బిట్–2లో ఒకటి, లింగంగుంటలో ఒకటి ఖాళీలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 10వ తరగతి పాసై 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు.

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం 10.30 గంటల నుంచి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం (స్పందన) నిర్వహించనున్నట్లు ఆర్డీఓ సాధు కరుణకుమారి ఆదివారం తెలిపారు. కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించి అర్జీలను నేరుగా అందజేయొచ్చునని ఆమె తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు అందరూ స్పందన కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ స్థలానికి కొత్తరూపు



డీసీపల్లి పోలీస్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న ఆత్మకూరు సీఐ వేణు, మర్రిపాడు ఎస్సై తదితరులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో బ్రిటిష్ హయాం నాటి పోలీస్‌స్టేషన్ మండల వ్యవస్థ ఏర్పాటు తర్వాత మర్రిపాడుకు తరలించారు. రెండు దశాబ్దాలకు పైగా నిరుపయోగంగా ఉన్న పోలీస్‌స్టేషన్ స్థలాన్ని త్వరలోనే నూతన హంగులతో కొత్తరూపు తెచ్చేందుకు ఆత్మకూరు సీఐ జీ వేణు ప్రయత్నాలు ప్రారంభించారు. డీసీపల్లిలోని పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని మర్రిపాడు ఎస్సై విశ్వనాథ్‌రెడ్డితో కలిసి ఆయన క్షేత్రపరిశీలన చేశారు. మర్రిపాడు మండలంలో డీసీపల్లి వ్యాపార వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సుమారు 3 ఎకరాలకు పైగా ఉన్న పోలీస్‌స్టేషన్ స్థలం భవిష్యత్‌లో చాలా కీలకంగా మారనుంది. పోలీస్‌శాఖ పరంగా నూతన సర్కిల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన సదుపాయాలు, విస్తీర్ణం ఉన్నట్లుగా గుర్తించారు. స్వల్పంగా ఉన్న ఆక్రమణలను సర్వే చేసి త్వరలోనే తొలగిస్తామని, పోలీస్‌స్టేషన్ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నీడనిచ్చే చెట్లు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. పోలీసుల అనుమతితో యువకులకు క్రీడలు నిర్వహించేందుకు లేదా ఇతర అవసరాల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ వేణు తెలిపారు. స్థానికులు కూడా విలువైన పోలీస్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమణ చేయకుండా సద్వినియోగం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.